# దెబ్బ

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

హస్తకార్తె వచ్చి వారం రోజులైంది.

ఆకాశంలో అక్కడక్కడా వున్న పల్చటి మేఘపు తునకలన్నీ పొద్దుపొడుపు దిశగా సాగిపోతున్నాయి. ఎక్కడో పడమటి అంచుల్నించి పయనమై నెమ్మదిగా కదలి వస్తున్నవి కాస్తా తూర్పు దిశకు వంగేసరికి వడుపందుకొంటున్నాయి.

మేఘాల నీడల వల్ల ఎండ బాధ తప్పినా సూదుల్తో పొడిచినంత ఉక్కపోతగా వుంది. కూలీల వొళ్లంతా చెమటలు కారుతున్నాయి.



అంతస్తుపైకి మోసుకుపోతున్నారు వాళ్లు.

ఓవైపు తాపీ పని చేస్తూనే అన్నీ గమనిస్తున్నాడు చెన్నకేశవ.

మేఘాల కదలిక అతనికి కొంత అలజడిని కలిగిస్తూ వుంది.

''రాండి... రాండి... రోంత బెరీన నడ్సండి...'' కూలీల్ని హెచ్చరించాడు. ''మీరు తెచ్చే మాల్ బెల్దార్లు తిని ఎగజూస్ట్రాండరు... వాల్లకాడ కుప్పలు బడాల వాల్లకు సెమటలు బట్టాల... ఆ...''

ఓ ఆడమనిషి అతనికేసి తలదిప్పి చూసింది. ''యింగా యాడ పరిగెత్తమంటావన్నా! ఎక్కి దిగి పిక్కలు పట్టకపోతాంటే...'' అంది.

''ఇదేం కలుపుదీసే పనెనుకున్నెవా? తొల్లికతో అట్టా పొడ్సుకుంటా యిట్టా పాట బాడుకుంటా కూకోడానికి. టౌనుపనెమ్మా యిదీ... యీపూట జమాయించి పన్జేస్చేనే రేపు కూలికి పిల్చేది.... ఆ...'' కొంత వ్యంగ్యం మిళితం చేస్తూ చెప్పాడు చెన్నకేశవ.

ఈరోజు సరిగ్గా పన్జేయకుంటే రేపు పని దొరకదనే బెదిరింపు అతని మాటల్లో.

మరో మాట లేకుండా దిగిపోయింది ఆమె.

నడుములెత్తు కట్టిన గోడపైన్నించి మిద్దె ముందు భాగంలోకి తొంగి చూశాడు చెన్నకేశవ.

కూలీలంతా కొత్తవాళ్లే.

అడ్డపంచెలు, గోచికట్టుళ్లు, బరువు మోస్తూ మిద్దె ఎక్కడంలో తడబాట్లు, మాటల్లేకుండా మౌనంగా కదలటాలూ... యీ పని కొత్తే అయినా పల్లెల్లో అపారమైన వ్యవసాయానుభవం ఉండటం వలన అలవోకగా చేసుకుపోతున్నారు.

తనే వాళ్లని అనవసరంగా తొందరిస్తున్నాడేమో!

తప్పదు మరి! బంగాళాఖాతంలో వాయుగుండం లేచినట్టుంది. అది తుఫానుగా మారితే యిబ్బందే. ఈరోజు రేపట్లో పనయిపించుకోవాలి. లేకుంటే తను దెబ్బతినగలడు.

అతని చూపులు రోడ్డువెంట కొంతదూరం సాగాయి.

అక్కడక్కడా మిద్దె పనులు జరుగుతున్నాయి.

ఇటుక, ఇసుక రోడ్డుమీదకు రావడంతో వాటిని దాటుకొనేందుకు ఆటో ఒకటి తంటాలు పడుతోంది.

దారిన వెళ్లేవాళ్లు మిద్దెపనికేసి ఎగాదిగా చూస్తూ నడుస్తున్నారు.

చూపులు వెనక్కి లాక్కుని తాపీనిండా సిమెంటు తీసి ఇటుకల సందులకు మెత్తుతూ ఏదో సందేహం వచ్చిన వాడిలా తాపీని కదల్చకుండా ఇటుక మీదే నిలిపిన చూపుల్ని మాత్రం కదల్చి తిరిగి దారికేసి చూశాడు.

ఎదురుగా వంద గజాల దూరంలో రోడ్డుమీద నిల్చుని కొత్తగా కడుతోన్న మరో మిద్దెకేసి తదేకంగా చూస్తున్నాడు ఓ మనిషి.

ఎవరో ముసలాయన. తలగుడ్డ, ముతక చొక్కా, గోనెపంచె... ఆ దృశ్యమే తన చూపుల్ని తిరిగి లాక్కుంది.

ఎక్కడో చూసినట్టుంది అతన్ని.

ఏదో జ్ఞాపకాన్ని మెదడులోంచి వెలికి తీసేందుకు చూపులు తెగ అవస్థపడుతున్నాయి.

ఆ మనిషి... పల్లెటూరి మనిషి... తెల్లారింది మొదలు మట్టిలో మశానంలో పొర్లాడే రైతు... ఆ మనిషి.... ఏదో జ్ఞాపకం... అందినట్టే అంది జారిపోయే స్మృతి.. అతన్ని పోల్చుకొనేందుకు ప్రయత్నించి... ప్రయత్నించి...

అతనెవరో అర్థమయ్యేసరికి ఉలిక్కిపడ్డాడు చెన్నకేశవ. గుడ్లు మిటకరించి నోరు తెరుచుకపోయి చూశాడు.

''అమ్మ నాకొడక రాంరెడ్డీ! నువ్వా!!'' అతని పెదాలు అప్రయత్నంగానే గొణిగాయి.

పదేళ్ల కిందటి జ్ఞాపకాలు దుమ్ము తెరల సుడిగాలుల్లా మొహానికి కొట్టి వూపిరాడకుండా చేశాయి.

ఆనాటి సంఘటన కళ్లముందు సజీవ దృశ్యమైంది.

చేయి చెంపను తడిమింది.

మరో చేయి మెడను నిమిరింది.

'ఇన్నేళ్లు నిరీక్షణకు ఈరోజు దొరికాడు'

తన్ను కొట్టిన దెబ్బలకు ప్రతిగా వాణ్ణి వీధివీధి తిప్పి తిప్పి కొట్టాలి. దారుణంగా అవమానించాలి – తనకులాగే.

ఆవేశంతో ముక్కుపుటాలు అదిరాయి అతనికి.

రక్తప్రసరణ వేగం పెరిగింది.

తాపీ పక్కన పడేశాడు.

''నాకు రోంత అర్జంటు పనిబడింది. బిన్నే వస్తా. పని జాగర్త...'' మరో బేల్దారికి బాధ్యతలు అప్పగించి బైటక్కదిలాడు.

తలొంచుకుని మెట్లు దిగుతున్నాడేగాని ఆలోచ



నలన్నీ రాంరెడ్డి మీదే వున్నాయి.

రోడ్డెక్కుతూ ఎదురుగా చూశాడు.

రాంరెడ్డి కన్పించిన తావుకేసి ఆత్రుతగా వెదకాడు.

అతని పొలకువ లేదు.

బిరబిర రోడ్డెంట నడిచాడు.

రాంరెడ్డి కన్పించిన తావువద్దకెళ్లి నిల్చున్నాడు.

ఎదురుగా కూలీలతో గలగలమంటోన్న మిద్దె నిర్మాణ దృశ్యం.

మరోవైపు యాభై గజాల దూరంలో మెయిన్ రోడ్ మీద వాహనాల హడావిడి.

ఇంకోవైపు సంసారాల యిళ్ల వరస.

ఎక్కడికి వెళ్లినట్లు?

ముదుక చొక్కా, తలగుడ్డ, గోచిపంచె... ఏడీ? జనాల మధ్యగానీ... యిళ్ల సందుల్లో గానీ.. రోడ్డు మీద గానీ... ఏడీ? ఇంతలోనే మంత్రమేసినట్లు ఎట్లా మాయమయ్యాడు?

అతన్ని పట్టుకోవాలి.

దెబ్బకు దెబ్బ కొట్టి తన కసి తీర్చుకోవాలి.

ఒక్క నిమిషంలో మెయిన్ రోడ్డెక్కాడు చెన్నకేశవ.

'ఆటోలో వెళ్లిపోయాడేమో?'

'పన్జొసుకొని బస్టాండుకెళ్లాడేమో - బస్సెక్కేందుకు'

అటుగా వస్తోన్న ఆటోకు చేయి అడ్డుంచాడు.

అందులో దూరి ''బస్టాండుకు పోనీ...'' చెప్పాడు.

దారివెంట జనాల్లోకి గుచ్చిగుచ్చి చూస్తున్నాడు.

'అతనెక్కడున్నా తను సులభంగానే గుర్తుపట్టగలడు'

'తన్నతను అవమానించిన తీరు మొన్నమొన్నటిదాకా కెలుకుతూనే వుండిపోయింది. ఆ వూరి వాళ్లు కన్పిస్తే చాలు మొగం చాటుచేసుకొని వెళ్లేవాడు తను. ఏదైనా పనిబడి టౌనుకొస్తాడేమోనని రాంరెడ్డికోసం తీరిక సమయాల్లో బస్టాండులన్నీ వెదికేవాడు.

ఇన్నేళ్లకు కన్పించాడు.

ఈ అవకాశాన్ని వదలకూడదు.

బస్టాండులో దిగాడు.

మనిషి మనిషినీ పట్టిపట్టి చూస్తూ ప్రాంగణమంతా వెదికాడు.

ఆవూరివైపు వెళ్లే బస్సుల్లో పరిశీలించాడు.

బస్టాండు నిండా చిన్నచిన్న మూటలతో పల్లె జనం.

వాళ్లంతా కూలీపనులకోసం టౌనుకొచ్చినవాళ్లే.

బస్టాండు బైట కూడా చూశాడు.

పాతబస్టాండుకు ఎళ్లుంటాడేమో!

మళ్లీ ఆటో ఎక్కాడు.

కోటిరెడ్డి సర్కిల్ వద్ద పేవ్‌మెంట్ల మీద చూశాడు.

అక్కణ్ణించి లక్ష్మీరంగ థియేటర్ దాకా చూపుల్ని సారించాడు.

అక్కడక్కడా గోడల కింద కూచుని వున్నారు కూలీకొచ్చిన జనం.

వానల్లేకపోవడం వలన పల్లెల్లో తాగేందుక్కూడా నీళ్లు లేవుట. రెండేళ్ల నుంచి కె.సి. కెనాల్‌కు నీళ్లు వదలకపోవడం వలన ఆయకట్టు కింది కూలీలే కాకుండా, ఆ ఆయకట్టు మీద ఆధారపడి బతికే జనం ఇరుగు పొరుగు తాలూకాల కూలి జనం కూడా కడుపు చేతబట్టుకొని కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, తిరుపతి లాంటి టౌన్లమీద పడ్డారుట.

ఒక్క పదును వాన కురిస్తే వీళ్లంతా మళ్లీ పల్లెలకు పోతారు.

వ్యవసాయేతర పనులు వీళ్లకు అరగవు.

వర్షం వచ్చే సూచనలు కూడా కన్పిస్తున్నాయి.

ఈలోపలే మిద్దె పనులు పూర్తిచేసుకోవాలని తనలాంటి వాళ్ల తహతహ. తక్కువ కూలీకే నేనంటూ నేనని వచ్చే కూలిజనంతో పని జరుపుకోవడం వలన పది రూపాయలు మిగిలే కాలం. అందుకే తనలాంటి మేస్త్రీలంతా మిద్దె పనుల్ని గుత్తకు వొప్పుకొని చేయిస్తున్నారు.

కూలిగా, బేల్దారిగా, మేస్త్రీగా, యిప్పటి కంట్రాక్టర్‌గా అంచెలంచెలుగా ఎదిగేందుకు ఎంత కష్టపడ్డాడనీ తను! ఈ కరువులోనే యింకొంత హుషారు చేసికొంటే బాగా నిల్దొక్కుకోగలడు.

ఆలోచిస్తూనే రోడ్డుపక్క జనాల్ని పరిశీలిస్తున్నాడు చెన్నకేశవ.

రుమాలు చుట్టిన తలకోసం వెదకుతున్నాడు.

అరచేతుల ముతక చొక్కా.... గోచిపంచె...

మహిళా కళాశాల దాటి... సినిమా థియేటర్లు దాటి... పాతబస్టాండు కూడలి వద్ద ఆగి....

బస్టాండు లోపలా, బైటా, అవధూతేంద్ర స్వామి గుడిముందూ... గోడల కిందా... జనాల సందుల్లో... వెదకి వెదకి...

అతనికి ఆశ్చర్యంగా వుంది.

'దొరికినట్లే దొరికి తప్పించుకొన్నాడు'.

ఏడు రోడ్ల కూడలిలో నిల్చుని చుట్టూ రోడ్లన్నీ పరిశీలించినా –

రాంరెడ్డి ఆచూకి చిక్కలేదు.

అతనికి అసహనంగా వుంది.

కోపంతో కూడిన అసహనం.

ఇంకెక్కడ వెదకాలో అర్థం కాలేదు.

ఏం చేయటానికి తోచలేదు.

తన్నతను వూరందరి ముందు చెంప పగిలేలా కొట్టి, మెడబట్టి వూరి గమిలి దాకా గెంటి, జుట్టు పట్టుకొని కిందపడేసి వీధుల్లో యీడ్చిన జ్ఞాపకాలు కెలుకుతున్నాయి. అతను కన్పించకపోయేసరికి ఎదుటబడి మరీ వెక్కిరిస్తున్నాయి.

ఆశ చావక జనం మధ్య వెదకుతూనే వెనుదిరిగాడు.

అతను దొరికితే ఇన్నేళ్ల తన కసిదీర్చుకొనేవాడు.

తనెంత బతిమాలాడాడనీ!

ఒక్క యేడాది అవకాశమివ్వమన్నాడు. కూలీ నాలిజేసి అయినా సంపాదించి అప్పు తీరుస్తానన్నాడు. వినిపించుకొంటే గద! పనీబాటా లేని పోరంబోకుగా తన్ను చిత్రీకరించాడు. అట్లాగే వుంటే ఏటికేటికి అప్పు తడిసి మోపెడవుతుందనే సాకుతో ఉన్న ఎకరా భూమి తన పరం చేసుకొని తనతోటి మరో యిద్దరి అప్పులు చెల్లేశాడు. భూమి పోయినందుకు బాధలేదుగాని తనకది అవమానకరంగా తోచింది. ప్రతిఘటించాడు. ఫలితం మెడబట్టి గెంటించుకొన్నాడు.

తను కాకుండా మరొకడయ్యుంటే మొబ్బున్నో, మోడాన్నో పోయి రాంరెడ్డిగాని గొంతు కోసి



## అందాల మెరుపుతీగ

బ్రిట్నీస్పియర్స్, జెన్నిఫర్ లోపెజ్‌లా నిత్యం పత్రికలకెక్కకపోయినప్పటికీ పాశ్చాత్య పాప్‌కోయిలగా పేరెన్నికగన్న కైలీ మోనిగ్‌ను పాశ్చాత్య యువత ఓ అందాల నాయికగా అభివర్ణిస్తుంటారు. 2003 సంవత్సరానికి సెక్సియెస్ట్ వుమెన్‌గా బిరుదుదక్కించుకున్న ఈమె అందగత్తెగా కూడా పేరుదక్కించుకుంది. ఇంతవరకూ కైలీమోనిగ్ నాలుగు ఆల్బమ్‌లే విడుదల చేసినప్పటికీ పేరుమాత్రం పెద్దగా పాకిపోయింది. సెక్సీగా వుండటమే ఆమెలోని ప్రత్యేకతని పాప్ ఇండస్ట్రీ అభిప్రాయం.

వచ్చుండేవాడు.

తనకా తెంపు లేకపాయ.

టౌనుకొచ్చినపుడన్నా కసిదీర్చుకోవాలని యిన్నేళ్లూ పగను బతికించుకొని ఎదురు చూశాడు.

ఇప్పుడు అందినట్టే అంది ఆ అవకాశం కూడా జారిపోయింది.

పని వద్దకెళ్లాడేగాని అతనికి అన్యమనస్కంగానే వుంది.

తన్ను అనుక్షణం తొలుస్తూ వున్న అవమానపు మచ్చనొకదాన్ని జీవితాంతం వెంట రాకుండా యిక్కడే తుడిచేసికొనే అవకాశం చెదిరిపోయింది.

సాయంత్రం పనయిపోగానే కూళ్లు పంచాడు.

కూలీలు దొరకని రోజుల్లో అయితే వారానికొకసారి కూళ్లు వొగదెంచేవాడు. కానీ యిప్పుడు పుష్కలంగా కూలీలు దొరుకుతున్నారు కాబట్టి ప్రతి ఉదయం తక్కువ కూలీరేట్ల ప్రాతిపదికన కొత్తవాళ్లని కూలికి పిల్చుకొంటున్నాడు.

రాంరెడ్డి సంగతి అతన్ని యింటిదాకా వెంటాడుతూనే వుంది.

భోజనాల సమయంలో తన ఆవేదనను భార్య ముందు పరిచాడు.

''ఆయప్ప మనకు మేల్ జేసిందులే...'' అంది ఆమె.

ప్రశ్నార్థకంగా చూశాడు.

''ఆరోజు నిన్ను మెడబట్టి తరమకుంటే నువ్వు టౌనుకొచ్చేవానివా? మేస్త్రీవయ్యేవానివా?''

కొద్దిక్షణాల మౌనం తర్వాత అన్నాడు. ''వాడు నా బాగుకోరి తరమలేదులే.. దొంగనాకొడుకు...''

తర్వాత ఆమె ఏమీ మాట్లాడలేదు.

పడుకొన్న తర్వాత కూడా అతన్ని కెలుకుతూనే వుంది. పగటి దృశ్యం.

పల్లె కూలీల దైన్యస్థితి కూడా ఓవైపు దృశ్యమానం కాసాగింది.

వాళ్లలాగే తనూ మొదట్లో అవస్థపడ్డాడు.

పల్లె చేత అవమానించబడి వచ్చాడు కాబట్టి తను బేల్దారి పనిని వృత్తిగా స్వీకరించగలిగాడు.

వాళ్లట్లా కాదుగదా!

వానగాలి వస్తే చాలు తమ పొలాలకేసి చినుకుల కంటే ముందే పక్షుల్లా ఎగిరిపోగలరు.

వాన రావటమే గగనంగా వుంది.

పొలాన్ని నమ్ముకొని పల్లెల్లోనే పడుంటే తన పరిస్థితి కూడా వీళ్లలాగే దారుణంగా వుండేది.

పొలానికి దూరమ్మై, అవమానాలపాలై పల్లె వదలటం ఒక పీడకలే అయినా – తన భార్య అన్నట్లు – యిప్పటి పరిస్థితుల దృష్ట్యా చూస్తే ఆ సంఘటన తన పాలిట వరమే.

అలాగని రాంరెడ్డి తనకేమీ మేలు చేయలేదు.

వాడి పాటు బావుందని వినికిడి. బోరుబావి దించి బిర్రుగానే వ్యవసాయం చేస్తున్నాడని నాలుగేళ్ల కిందట విన్నమాట. తనలాగా వూరిడ్సిపోయే వాళ్ల భూములు కూడా చవగ్గా కొని తన కయ్యల్లో కలిపేసుకొని బలపడి వుంటాడు.



## బ్రాండ్ అంబాసిడర్

సెక్సీ కళ్లు, మత్తెక్కించే చూపు, దాగని పరువాలతో దర్పంగా కనిపించే సెలీనాజైట్లీ బాలీవుడ్ ఫంక్షన్‌లు, పార్టీలలో ఎప్పుడూ రోల్‌మోడలే. తొడలపైకి మాత్రమే వున్న నూడ్‌స్ట్రాప్స్ గౌన్లు వేసి, ఆడియన్స్‌ను ఆకర్షించాలనుకునే సెలీనా ఓ డైమండ్ షాపుకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసింది. అమ్మాయిలకు డైమండ్స్ ఫ్రెండ్స్ అయితే... మీ అందరికీ నేను ఫ్రెండ్‌నే అన్నట్టు ఫోజులిచ్చి తన చిన్నగౌనులో వినియోగదారులకు మత్తెక్కించింది.

ఆ ఆలోచన తన్ను బాధిస్తూ వుంది.

చాలా రాత్రిళ్లు నిద్రలేకుండా చేసింది.

ఆ రాత్రి కూడా బాగా పొద్దుబోయేదాకా నిద్ర పట్టలేదు.

తెల్లవారుతూనే ప్రయాణమ్మై వెంకటేశ్వర థియేటర్ వద్దకు చేరాడు.

పల్లెల్నించి వచ్చిన కూలీలతో అప్పటికే అక్కడ పెద్ద గుంపు తయారయి వుంది. కొన్ని వందల మంది జనం తొక్కిసలాడుతున్నారు. సైకిల్ వచ్చి ఆగినా, స్కూటర్ మనిషి నేల కాలు పెట్టినా దాని చుట్టూ గుమిగూడుతున్నారు. పనికోసం ఎగబడుతున్నారు.

వచ్చిన మేస్త్రీలంతా అక్కడున్న వాళ్లల్లో మెరికల్లాంటి వాళ్లను యేరుకుపోతున్నారు. కొంచెం వయస్సు పైబడిన వాళ్లను ఎవరూ దగ్గరకు రానీయటం లేదు. ఏపనికీ పిలవటం లేదు. వాళ్లు ప్రాధేయపడుతున్నా విన్పించుకోవడం లేదు.

అక్కడి తతంగమంతా ఒకసారి పరిశీలనగా చూశాడు చెన్నకేశవ. తలపాగా చుట్టుకొన్న ముసలాయన ఒకడు మేస్త్రీలను ప్రాధేయపడుతూ కనిపించేసరికి రాంరెడ్డి గుర్తొచ్చి నవ్వుకున్నాడు.

నిన్న పనికి వచ్చిన వాళ్లు తన్ను చూడగానే పరుగెత్తుకుంటూ దగ్గరకొచ్చారు. తమకు సంబంధించిన యింకొంతమందిని వెంటబెట్టుకొచ్చారు.

కూళ్లు బేరం జరుగుతున్నాయి.

నిన్నటికి యివాల్టికి కూలిరేట్లు కొంతమేర తగ్గాయి. ఎవరెవరో వచ్చి పని యిప్పించమని ప్రాధేయపడుతున్నారు.

వాళ్లను చూస్తోంటే కడుపులో కెలికినట్లుగానే వుంది. అయినా తనేం చేయగలడు?

తనకు సరిపడినంత మందిని కుదుర్చుకొని, వాళ్లంతా తనచుట్టూ పరివేష్టించి వుండగా పనిని గురించి చెబుతున్నాడు చెన్నకేశవ.

''నాయినా! నాకు రోంత పనిప్పీ నాయినా! మూఁరోజుల్నుంచి తిరుగుతాండ. యాడా పనిదొరకలే...''

మాటలు విన్పించిన దిశకేసి కూడా చూడలేదు అతను. ఇప్పుడిక్కడ ఆ వేడికోళ్లు సహజమే!

''మావోళ్లే మిగిలిపోయినారుపో పెద్దాయనా!'' ఓ కూలి చెబుతున్నాడు.

''నేనుగుటకా బాగా బతికినోన్నేలే సిన్నోడా! కాలం కలిసిరాక యిటొచ్చినా! పదెకరాల పొలం... బోరు:. కుంట నీళ్లు... ఎందుకులే నాయినా అయ్యన్నీ! వానదేవుడు కన్ను దెర్సాలగానీ బూమిలేకి ఎన్ని బొక్కలు దించితే ఏం లాబం? బోర్లు బేసి బేసి నీల్లు పడక... అప్పులపాలై.. కొడుకు పురుగుమందు తాగి సచ్చినా.. మనమండ్లకోసరం మొండిగా బతుకుతా... ఏం జెయ్యాలయ్యా! ... వానదేవుడు దెబ్బగొట్టె...''

ఆ గొంతు, ఆ మాటల లయ చెన్నకేశవను చివుక్కున తలెత్తి అటుకేసి చూసేలా చేశాయి.

ఎదుటి మనిషిని చూసి నిలువు గుడ్లు పడ్డాయి అతనికి. తలపాగా... ముదుక చొక్కా... గోచి పంచె... రాంరెడ్డి... తన భూమి లాక్కొన్న పల్లె రైతు రాంరెడ్డి... తన్ను బలంగా దెబ్బతీసిన రాంరెడ్డి... తను ప్రతిగా దెబ్బతీయాలని నిన్నంతా వెదికినా దొరకని రాంరెడ్డి... తనకిప్పుడు అత్యంత చేరువలో... తన దెబ్బకు అందే దూరంలో...

తల తిరిగిపోయింది చెన్నకేశవకు.

కూలినాలి జనమే పనుల్దొరకక కడుపు చేతబట్టుకొని టౌనుకొస్తున్నారనుకొన్నాడుగానీ... రైతుల్ని సైతం వూరు విడిచి కూలిపనులు వెదక్కొనేలా యీ కరువు – వాళ్ల జీవితాలు ఛిద్రమయ్యేంతగా దెబ్బ తీస్తుందని అతను వూహించలేదు.

కరువు దెబ్బ ముందు తను కొట్టాలనుకొన్న దెబ్బ ఏపాటిది!

తను దెబ్బకొట్టి కసితీర్చుకోవలసిన అంశం ఏకొద్దిపాటయినా యీ కరువు – రాంరెడ్డిలో మిగిల్చిందేమోనని అతనికేసి కన్నార్పకుండా చాలాసేపు చూస్తూనే వుండిపోయాడు చెన్నకేశవ. ★